ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 589 (309.0510) | 51,680 | 51,680 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.95 (4.18) | 4,132.84 | 3,983.93 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.818 (43.9377) | 38,080 | 17,000 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



# పరిహారం అందేనా?

- మొంథా తుఫాన్ బాధిత రైతుల ఎదురుచూపు
- 61,511 ఎకరాల్లో పంటనష్టం
- అంచనావేసి పంపిన వ్యవసాయశాఖ
- తరచూ నష్టం వాటిల్లుతున్నా అందని పరిహారం

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పంట చేతికొచ్చేదశలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. రైతులకు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటివరకు ప్రతిపాదనల దశకే పరిమితమవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ పరిహారం చెల్లించలేదని, ఈసారి భారీగానష్టం వాటిల్లడంతో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ప్రధానంగా తుఫాన్ ప్రభావంతో వరి, పత్తి రైతులు అధికంగా నష్టపోయారు. పరిహారాన్ని సైతం కంటితుడుపు చర్యలాగాక ఉపశమనం కల్పించేలా ఇవ్వాలని డిమాండ్ రైతులు చేస్తున్నారు.

### 61,511 ఎకరాల్లో పంటనష్టం

జిల్లాలో అక్టోబరులో వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా 310 గ్రామాల్లో 30,359 మంది రైతులు పంటనష్టపోయినట్లు వ్యవసాయశాఖ నివేదించింది. జిల్లా వ్యాప్తంగా 35,487 ఎకరాల్లో వరి, 25,919 ఎకరాల్లో పత్తి, మరో 105 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం 61,511 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు నిర్ధారించిన వ్యవసాయశాఖాధికారులు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారమిస్తే, రూ.61.51కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటుందని తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. అయితే రైతులు మాత్రం ఈసారి పంటనష్టం ఎక్కువగా జరిగిందని, దాదాపు 50శాతం మేర దిగుబడులు తగ్గాయని, పత్తి పరిస్థితి మరీ దారుణంగా ఉందని, ఈ దఫా పరిహారాన్ని ఎకరాకు కనీసం రూ.25వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తుఫానుతో పాటు ఆగస్టులోనూ వర్షాలతో జిల్లాలో 11వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గడచిన యాసంగి సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాల కారణంతో జిల్లాలో 726.30 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనావేశారు. అందుకు రూ.72.69లక్షలు పరిహారంగా చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు

- మిగతా 8వ పేజీలో...

### రైతులకు పరిహారం చెల్లించాలి



మొంథా తుఫాన్‌తో జిల్లాలో వరి, పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలోనూ పంటలు నష్టపోతే జిల్లా రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఈసారి భారీగా జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. తక్షణమే పంట నష్టపరిహారం అందజేయాలి. గత యాసంగిలో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలి.

- డి.గంగాధర్, బీజేపీ నేత, తిప్పర్తి

## ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

మంత్రులు ఉత్తమ్, తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం,పత్తి, సోయా తదితర పంటల కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మా ట్లాడారు. అన్ని రకాల పంటల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నా రు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అవసరమైనం త త్వరగా తరలించాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలను సిద్ధంగా ఉంచాలన్నారు. మిల్లర్లు, కాంట్రాక్టర్లు, హమాలీలతో ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు రూ.160కోట్లు చెల్లించామని, ఇంకా రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. వర్షాలతో 4,600 మెట్రిక్‌టన్నుల తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లర్లు కొనుగోలు చేశారని తెలిపారు. పత్తి తేమను పరిశీలించేందుకు 83 యంత్రాలు కావాలని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎల్-1 కేంద్రాలు నల్లగొండలోనే ఉన్నందున యంత్రాల కొనుగోలుకు అనుమతి కావాలని కోరారు. దీంతో మంత్రి తుమ్మల తక్షణమే యంత్రాలను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో పత్తి సేకరణలో భాగంగా 23 కేంద్రాలకు, 15 మిల్లుల్లో ఇప్పటి వరకే ప్రారంభించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# యాంత్రీకరణకు ఆమోదం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో యాంత్రీకరణ పథకం ఓ కొలిక్కి రాగా, మండల స్థాయిలోని త్రిమెన్ కమిటీల ఆమోదం కూడా పూర్తయింది. దీంతో ఉమ్మడి జిల్లాలకు చెందిన మండల కమిటీల జాబితాలు సైతం కలెక్టరేట్‌కు చేరాయి. ఈ వారంలోగా జిల్లా స్థాయి కమిటీ ఆమోదం అనంతరం తుది జాబితా వెల్లడించనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు రూ.6.18కోట్లు కేటాయించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- మండల కమిటీల నుంచి చేరిన నివేదిక
- వారంలోగా జిల్లాస్థాయి కమిటీ నుంచి తుది జాబితా
- ఉమ్మడి జిల్లాకు రూ.6.18 కోట్లు కేటాయింపు

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ఏర్పాటు అనంతరం గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను కొనసాగించింది. ఆ తరువాత ఆరేళ్లుగా ఈ పథకం నిలిచింది. దీంతో ప్రోత్సాహం కరువై రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండా పోయాయి. రాష్ట్ర ఏర్పాటు అనంతరం గత ప్రభుత్వం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణన పథకాన్ని కొనసాగించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల సుమారు రూ.50కోట్లను కేటాయించింది. అయితే ఆ తరువాత పథకం నిలిచిపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం అమలుకు నిర్ణయం తీసుకొని నిధులు కేటాయించింది. అయితే రెండు సార్లు వివిధ కారణాలతో పథకం అమలు వాయిదాపడింది. చివరికి తాజాగా, ఈ పథకం అమలులోకి వచ్చింది. ఈ పథకం కింద ఎంపికైనా రైతుల నుంచి అధికారులు డీడీలు సేకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీపై పరికరాలు ఇవ్వనుండగా, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీపై పరికరాలు అందించనున్నారు.

### యాసంగి ప్రారంభంలోగా పరికరాలు

ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించమేగాక ఈ యాసంగి నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు అందజేయాలని నిర్ణయించింది. అయితే కొంత ఆలస్యమైనప్పటికీ సీజన్ ప్రారంభంలోనే రైతుల నుంచి డీడీలు తీసుకొని వారికి రాయితీపై పరికరాలు అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయడమేగాక జిల్లాల వారీగా యంత్రాలకు రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారుల నుంచి నివేదికలు తీసుకొని అందుకు అనుగుణంగా నిధులు కేటాయించింది.

### మేళా ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను అధికారులు రూపొందించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, కిసాన్ డ్రోన్లతో పాటు ఇతర యంత్రాలనూ పంపిణీచేయనున్నారు. 2018నుంచి 2023 వరకు ఈ పథకం నిలిచిపోవడంతో యంత్రాలు రాక రైతులు ఇబ్బందులను ఎదుర్కొన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మేళా నిర్వహించి రైతులకు పరికరాలు అందించాలని భావిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది...

- మిగతా 8వ పేజీలో...

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ అనే విష సంస్కృతికి దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో సోదరభావంతో కలిసిమెలసి ఉండాలన్నారు. జూనియర్లు, సీనియర్లు అనే బేధం విడనాడి నేటి సీనియర్లే ఒకప్పటి జూనియర్లు అనే విషయం మర్చిపోవద్దన్నారు. ర్యాగింగ్ పాల్పడిన వారిపై కేసు నమోదైతే ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. చట్టాలు పటిష్ఠంగా ఉన్నాయన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి, ఎస్బీసీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదులు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీ శరత్ చంద్రపవార్ పలు ఫిర్యాదులను పరిశీలించడంతో పాటు ఆర్జీదారులతో నేరుగా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## ‘ప్రజావాణి’ ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):‘ప్రజావాణి’ ఫిర్యాదులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. ఫిర్యాదు పరిష్కారం కాకుంటే వివరాలను తెలియజేయాలన్నారు. మొత్తం 94 ఫిర్యాదులు రాగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 63 ఉన్నాయి. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రోడ్డు భద్రతను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, దీంతో పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మానవ తప్పిదాలతో ప్రమాదాలు జరగకుండా చూడాలని, అందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి పోలీస్‌శాఖ గుర్తించిన బ్లాక్ స్పాట్లు, సూచించిన ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల వర్షాలతో చిట్యాల అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి ట్రాఫిక్‌జామ్ ఏర్పడిందని, దీనిపై ఇరిగేషన్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమస్య ఇనుపాముల వద్ద కూడా గుర్తించినట్లు పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మర్రిగూడ బైపాస్ వద్ద రోడ్డుపై గుంతలను పూడ్చాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీస్‌శాఖ ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తోందన్నారు. వీటిపై తక్షణం స్పందించి ప్రమాదాలను నివారించాలన్నారు. చిట్యాల అండర్ పాస్ వద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్నారు. సర్వీస్ రోడ్లు లేకుండా పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్, వైఎస్ఆర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కె.జానీరెడ్డి, డీఈవో భిక్షపతి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఎస్పీ శివ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌కు జాగృతి అధ్యక్షురాలు

# కవిత రాక నేడు



నాగార్జునసాగర్,నవంబరు10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం సాగర్ నియో.క వర్గంలో పర్యటిస్తారని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి లింగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ నియోజక వర్గంలో జరుగుతున్న సుంకిశాల, నెల్లికల్ ఎత్తి పోతల పథకం పనులను ఆమె పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి మార్గ మధ్యంలో పలు ప్రాజెక్టులను సందర్శిస్తూ మధ్యాహ్నం 3 గంటలకు సుంకిశాలకు వచ్చి అక్కడ నుంచి నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే మీడియాతో మాట్లడతారని ఆయన తెలిపారు.

దేవరకొండ: జాగృతి అధ్యక్షురాలు కవిత చింతపల్లి మండలం కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టును సందర్శిస్తారని జాగృతి రాష్ట్ర కార్యదర్శి అశోక్‌యాదవ్ ఒక ప్రటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు దేవరకొండ మండలం కొమ్మెపల్లి గురుకుల పాఠశాలను, మధ్యాహ్నం 1 గంటకు నక్కలగండి ప్రాజెక్టును పరిశీలిస్తారని తెలిపారు. ముంపు రైతులతో మాట్లాడతారని పేర్కొన్నారు.

## చెర్వుగట్టు క్షేత్రంపై కార్తీక భక్తుల రద్దీ



చెర్వుగట్టు ప్రధానాలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం సోమవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గుట్ట నిండా ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కన్పించింది. స్వామి వారి పుష్కరిణిలో కార్తీక స్నానమాచరించిన భక్తులు తొలుత కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం సర్వ దర్శనం, ప్రత్యేక దర్శన మార్గాల ద్వారా భక్తులు మూలవిరాట్టు జడల రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మూడుగుండ్లపై ఉన్న శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. పాదరక్షల మొక్కు తీర్చుకున్నా రు. సామూహిక సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో మోహన్‌బాబు తెలిపారు.

### ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ

కార్తీక సోమవారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో ఘాట్‌రోడ్‌పై రాకపోలకు అసౌకర్యం కలగకుండా నార్కట్‌పల్లి పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఎస్ఐ యాదగిరి నేతృత్వంలో పోలీసులు ఘాట్ రోడ్‌పై ఒకదానికి ఒకటి ఎదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గుట్ట దిగుతుండగా మొదటి మలుపు వద్ద నాలుగ చక్రాల వాహనాలను నిలిపివేశారు. వివిధ ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు కూడా ఘాట్‌రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఘాట్‌రోడ్డుపై ఎదురయ్యే ట్రాఫిక్ సమస్య కొంత తీరింది.

## 90 శాతం వాటా దక్కాల్సిందే

బీసీ ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్

నల్లగొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాజంలో 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు విద్య ఉపాధి రాజకీయ వ్యాపార రంగాల్లో, భూమిలోను, సమస్త రంగాల్లో సబ్బండ వర్గాలకు 90 శాతం వాటా దక్కల్సిందేనని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివాంజనేయ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా అగ్రకులాలు 10శాతం ఉన్నామని అంగీకరించి, చట్టం చేసుకున్నారు కాబట్టి 10 శాతం లోపే విద్య ఉపాధి రాజకీయాల్లో రిజర్వేషన్లు పొందాలని, మిగతా 90 శాతం వాటా అణగారిన వర్గాలకే చెందాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య భారతంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అగ్రకుల రెడ్డి, వెలమ, కమ్మ, కరణం భూస్వామ్య దొరల కబంధ హస్తాల్లో తెలంగాణలోని సబ్బండ వర్గాల జీవితాలు బందీ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం కాదు 50శాతం విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని, ఇది ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధ హక్కు అని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్. నాగం కుమార స్వామి, జర్నలిస్ట్ విఠల్, బాలరాజు గౌడ్, జేఏసీ రాష్ట్ర నాయకులు వినోద్ యాదవ్, రాఘవేంద్ర ముదిరాజ్, జిల్లా జేఏసీ అధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బరిగల దుర్గాప్రసాద్ మహారాజ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యావంతులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

# ఉమ్మడి జిల్లాతో అందెశ్రీకి అనుబంధం

**తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, కవి అందెశ్రీతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉంది. తెలంగాణ రాష్ట్రోద్యమంలో భాగంగా నిర్వహించిన ధూంధాం, ఇతర కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయనకు అభిమానులు ఉన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.**

### అందెశ్రీని కోల్పోవడం తీరనిలోటు



తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ ప్రజాగాయకుడు అందెశ్రీ అకాల మృతి రాష్ట్ర ప్రజలకు తీరని లోటు. తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం కలిగించచారు. అందెశ్రీ మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తున్నా.

**గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్**

### ఆయన రచనలు నిలిచిపోతాయి



హుజూర్‌నగర్: తెలంగాణ గేయరచయిత అందెశ్రీ రచనలు చరిత్రలో నిలిచిపోతాయి. ఆయన మృతి సమాజానికి తీరని లోటు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, ఉనికి, సాహిత్యం రాసిన పాటలు చరిత్రలో నిలిచిపోతాయి. జయజయే తెలంగాణ గీతాన్ని రాష్ట్రీయ గీతంగా ప్రకటించి గౌరవించాం. ఆయన మృతికి నా ప్రగాఢ సంతాపం.

**ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి**

### ఆత్మకూరు(ఎం)లో ధూంధాంలో



ఆత్మకూరు(ఎం) : తెలంగాణ ఉద్యమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో నిర్వహించిన ధూంధాం కార్యక్రమంలో రచయిత అందెశ్రీ పాల్గొన్నారు. తన దైన బాణీతో పాటలు పాడి చైతన్యపర్చారు.

### తుర్కపల్లిలో నిర్వహించిన అయ్యప్పపూజలో



ఆర్టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డితో అందెశ్రీ

తుర్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో ఆర్‌టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి ఆదివారం తన ఇంట్లో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజకు తెలంగాణ సహజ కవి అందెశ్రీ హాజరయ్యారు. సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో పలువురు భక్తులు, నాయకులు ఫొటోలు దిగారు. సోమవారం ఉదయం ఆయన మరణవార్త వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించిన ఆయన గీతాలు తెలంగాణ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

### సాగర్‌తో ఎనలేని అనుబంధం

నాగార్జునసాగర్ : రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి అందెశ్రీకి నాగార్జునసాగర్‌తో ఎనలేని అనుబంధం ఉంది. సాగర్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2020లో సాగర్ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. 2024 నవంబరు 24న సాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీలో జిల్లా కవి సోమన్నతో కలిసి ప్రయాణించారు. బుద్ధవనంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆయనకు విజయవిహార్ హోటల్ మేనేజర్ మిట్టపల్లి శ్రీనివాస్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు జ్ఞాపికను అందజేశారు. అందెశ్రీ మృతితో ఆయనకు స్థానికులు ఘననివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాలను గుర్తుకు చేసుకున్నారు.

### తెలంగాణ నవలాకారుడిగా ఎదగాలనేవారు

నార్కట్‌పల్లి : తెలంగాణ భాషను బలంగా పట్టుకున్నావు, మేటి తెలంగాణ నవలాకారుడిగా నువ్వు ఎదగాలి ప్రవీణ్....అంటూ కవి అందెశ్రీ తనను ఎంతగానో ప్రోత్సాహించేవాడని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువకవి, పొత్తి నవలా రచయిత డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. తాను ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుకున్న రోజుల్లో ఉదయం సాయంత్రం ఓయూ ప్రాంగణంలో వాకింగ్ కోసం వచ్చే అందెశ్రీ తనను ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడని చెప్పారు. అచ్చ తెలంగాణ గ్రామీణ భాషలో తాను రచించిన 'పొత్తి' పుస్తకాన్ని బహుకరించగా చదివి ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లు అంటూ ప్రశంసించారని కవి ప్రవీణ్ ఆయనతో ఉన్న జ్ఞాపకాన్ని గుర్తుచేశారు.

## శతాధిక వృద్ధ బుర్రకథా కళాకారుడు మృతి



రామలింగం(ఫైల్)

రాజాపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన జానపద బుర్రకథ వృద్ధ కళాకారుడు చింతల రామలింగం(106) సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు కన్నుమూశారు. నెల రోజుల క్రితం ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. మనుమలు, మునిమనుమల తో కలిపి 200కి పైగా సంతానం ఉంది. రామలింగం జానపద బుర్రకథ కళాకారుడిగా కళను నమ్ముకుని జీవించాడు. గ్రామీణ కళలలో ఒక్కటైన బుర్రకథను తన పూర్వీకుల నుంచి తన 12వ ఏట నుంచే నేర్చుకున్నాడు. అక్షరం ముక్క రాకపోయినా..ఓనమాలు దిద్దకపోయినా కథలను ఒంటబట్టించుకుని ఊరూరా తిరుగుతు చెప్పేవాడు. నాటి నిజాంకు వ్యతిరేకంగా ఊరూరా తిరుగుతు తమ కళతో ప్రజలను ఉద్యమాల వైపు మళ్లించేందుకు ప్రదర్శనలిస్తూ తనవంతు కృషి చేశారు. రేణికుంట రాంరెడ్డి, కుర్రారం రాంరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి చరిత్రలతో పాటు పలు పురాణ, ఇతిహాస, పౌరాణిక చరిత్రలను ఏకధాటిగా చెప్పేవారు. ఏడాది కిందటి వరకు బుర్రకథను గ్రామాల్లో ప్రదర్శించారు. మండలంలో బుర్రకథను ప్రదర్శించే కళాకారుల్లో రామలింగం ఏకైక వ్యక్తి. రామలింగం మృతికి పలువురు నాయకులు, కళాకారులు సోమవారం సంతాపాన్ని ప్రకటించారు. గ్రామీణ కళను పది మందికి తెలుపుతు కళాకారుడు అందించిన సేవలను కొనియాడారు.

# బతుకులు ఆగమయినయ్

- సేతికొచ్చిన పంట నేలపాలాయే
- పెట్టుబడులు ఎల్లకపాయే
- ఎవసాయం దండగాయే
- ఇద్దరు అన్నదాతల ఆవేదన

**గీ ఏడు కాలం మంచిగయితది.. శానా వానలు పడతయని సెపితే.. సంబర పడ్డం.. గట్టనే మస్తుగ పడ్డయి..సేన్లు ఏపుగా పెరిగినయి.. సిరులు కురిపిత్తయి అనుకున్నం.. సివరకు గా వానే వరదై నిండ ముంచింది.. ఆరుగాల కట్టం సేతికి రాలే.. సాగుకు పెట్టిన పైసలు పాయే.. బతుకులు ఆగమాయే.. గీ కాలానికి ఎందుకంత కోపం.. నోటికాడి ముద్ద నేల పాలు సేసింది.. ఈ ఏడు పంట నష్టంపై ఇద్దరు రైతులు ఆవేదనే రచ్చబండ.**

– (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ(వ్యవసాయం)

రామయ్య: ఏం మల్లన్నా.. మంచిగున్నవా.. శానా దినాలయే.. కనిపించక ఏం సేత్తున్నవ్ ఏంది?

మల్లన్న : ఏం సెప్పాలే నా కట్టాలు.. ఒకటా రెండా.. బతకంతా ఆగమయింది..

రామయ్య : ఏంది గట్ల మాటాడుతున్నవ్.. గంత బాదేమొచ్చింది.. సెప్పు..

మల్లన్న : గీ ఏడు వానలకు పంటంతా పాడయింది.. గింత వరి, పత్తి సేను ఏస్తే రెండు పోయినయి.. వానకు నేల పాలాయే.. సాగుకు పెట్టిన పైసలు చేతికి రాక పాయే.. ఏం సేయాలే సెప్పు.. అప్పులు గెట్ల తీరాలే.. మా పొట్ట ఎట్ల గడవాలే తలుసుకుంటే గుండె బరువయితుంది..




రామయ్య : నా పరిస్థితి గట్లనే ఉంది.. వానకు పంట అంత పోయింది.. ఏం సేద్దాం సెప్పు, గిది మన ఇద్దరే పరిస్థితే కాదు.. రైతులందరిదీ.. గీ ఏడు.. అన్ని పంటలు వానలకు సర్వనాశనం అయినయి.. ఎవరి మొఖంల గింత సంతోషం లేదు.. ఎవర్ని పలకరించినా కన్నీళ్లే తప్ప మాటలు రాట్లేదు..

మల్లన్న : గిట్టయితే మనకు దిక్కెవరు సెప్పు.. గింత నట్టపోయినా.. ఎవరికి పట్టదాయే.. పంటను సూత్తే కండ్ల నిండా ఆగుతలేదు.. మనల్ని ఆదుకునేటోళ్లు లేక పాయే.. పంట పరిహారం ఊసే లేక పాయే..

రామయ్య: రైతు బతుకు గంతేమరి ఏం సేద్దాం. కాలం కనికరించకపాయే.. పంటలకు అన్ని రోగాలే నాయే.. పురుగు మందులు, ఎరువులు బాగా పిరమయినయి.. మస్తుగా పంట ఖర్చులు పెరిగినయి.. పంటకు మద్దతు ధర రాకపాయే.. సర్కారోళ్లకి మన కట్టాలు కనిపించకపాయే.. ఆళ్ల మనకేం సాయం చేత్తరు సెప్పు ఒట్టి మాటలు తప్ప..

మల్లన్న : మనకు ఎవసాయం తప్ప ఇంకో పని తెల్వదాయే.. సచ్చినా బతికినా..గిదే మన లోకం.. పంట ఏసినమా లేదా.. మిగులుడు దేవుడెరుగు.. కొత్తేం కాదు.. ఇది తరతరాల కథే..

రామయ్య : గీ మధ్య ఎవసాయం చేసినోళ్లు బాగుపడ్డట్టు చరిత్రల లేదు.. ఏదైనా పెద్ద కట్టం వత్తే రూపాయి అప్పు ఇచ్చే పరిస్థితి లేదు.. కన్న తల్లి లాంటి భూమిని తెగనమ్ముకునే పరిస్థితి. అంత కంటే రైతుల సేతుల ఏముంటది.. సెప్పు..గదీ సేత కాక పోతే సివరకు మన సావు మనం సావాలే.. గంతే..

మల్లన్న : ఏ పార్టీ నాయకుడు అయినా రైతు రాజ్యం అంటారు. రైతు కోసం ఏం సేయరు.. ఇంక మన బతుకులు మారవు..

# అద్దె చెల్లించడం లేదని ప్రభుత్వ పాఠశాలకు తాళం



తిలక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు తాళం వేయడంతో పాఠశాల ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా పాఠశాల భవనానికి అద్దె చెల్లించడం లేదని యజమాని తాళం వేయటంతో విద్యార్థులు గంటన్నరకు పైగా పాఠశాల బయటే ఉన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రం తిలక్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థలం లేకపోవడం, భవనం మంజూరు కాకపోవడంతో 2013 నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భవన యజమాని మామిడి సరోజ నెలకు రూ.18,500 ప్రాతిపదికన పాఠశాలకు భవనాన్ని అద్దెకు ఇచ్చారు. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో 80మంది విద్యనభ్యసిస్తుండగా, ఐదుగురు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ఇదిలా ఉండగా 30నెలలుగా సరోజకు ప్రభుత్వం అద్దె చెల్లింపులు నిలిచిపోయి మొత్తం రూ.5,55,000 అద్దె బకాయిలు పేరుకుపోయాయి. దీంతో అద్దె బకాయిలు చెల్లించాలని సరోజ, ఆమె కుమారుడు వెంకన్న పలుమార్లు అధికారులను కలిసికోరారు. దసరా పండుగ సమయంలోనూ ఉన్నతాధికారులను కలిసి బకాయిల విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినా బకాయిలు విడుదలకాలేదు.

**తాళం వేస్తామని హెచ్‌ఎంకు సమాచారం**

అద్దె బకాయిలు రాకపోవడంతో యజమాని సరోజ, ఆమె కుమారుడు వెంకన్న ఆదివారం రాత్రి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి సోమవారం పాఠశాల గేట్‌కు తాళం వేస్తున్నట్లు సమాచారం అందించారు. ఆ మేరకే సోమవారం పాఠశాల భవన గేట్‌కు తాళం వేశారు. ఎప్పటి మాదిరే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు గేట్‌కు తాళం వేసి ఉండటంతో ఆరుబయట చెట్ల కిందనే ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో దేశగాని శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ముందుగా విద్యార్థులను సమీపంలోని గిరినగర్ పాఠశాలకు తరలించారు. అనంతరం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడించారు. త్వరలో బకాయిలు చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో యజమాని సరోజ గేట్‌కు వేసిన తాళాన్ని తీశారు. వెంటనే గిరినగర్ పాఠశాల నుంచి విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యార్థులు ఆరుబయట, మరో పాఠశాలలో ఉన్నారు.

### కుక్క నోట నాలుగు నెలల
# మృత శిశువు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో కుక్క నోట్లో నాలుగు నెలల మృత శిశువు చర్చనీయాంశమైంది. సోమవారం స్థానిక విద్యానగర్‌కాలనీ నుంచి పారుతున్న నాలాలోకి సుమారు నాలుగు నెలల వయసుగల ఆడశిశువు మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి విసిరేశారు. నీటి ప్రవాహంలో కొట్టుకొస్తున్న విగత శిశువును వీధికుక్కలు సగ భాగం పీక్కు తిన్నాయి. మిగతా భాగాన్ని ఓ కుక్క నోట పట్టుకొని పరుగెత్తుతుండగా స్థానికులు గమనించి కుక్కను బెదరగొట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ సీఐ నాగభూషణరావు, ఐసీడీఎస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతశిశువును పరిశీలించారు. అనంతరం శిశువు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి ఆడ శిశువుగా నిర్ధారించారు. ఈ ఘటనపై విద్యానగర్‌కాలనీ అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి



జావిద్‌బాషా మృతదేహం

తిప్పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో జరిగింది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన షేక్ జావిద్ బాషా(28) ద్విచక్రవాహన మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. నల్లగొండ నుంచి ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం తిప్పర్తికి వచ్చి అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో తిరిగి వెళ్తున్నాడు. రాయినిగూడెం గ్రామసమీపంలోకి వెళ్లాక అదే సమయంలో మిర్యాలగూడ వైపు నుంచి నల్లగొండకు వెళ్తున్న టీఎస్07హెచ్‌పీ 1060 కారు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నుంచి కింద పడిపోయిన జావిద్‌బాషా పైనుంచి కారు వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి గౌస్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. బాషాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**లారీ, వాహనం ఢీకొని ఒకరు..**

చిలుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ, మరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరుల మండలంలోని మిట్స్ కళాశాల వద్ద సోమవారం జరిగింది. బాధిత బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నుంచి ఏపీ రాష్ట్రంలోని కర్నూలు వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని మిట్స్ కళాశాల వద్ద రాగానే హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపు వస్తున్న లారీ ప్రమాదవశాత్తు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్నూల్ పట్టణంలోని ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన గూడ్స్ వాహన డ్రైవర్ నల్ల బొక్కల రఘు(43) అక్కడికక్కడే మృతి చెందగా అదేవాహనంలో ఉన్న ఉపేందర్, పవన్‌కుమార్, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. రఘు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాడిగేదె

ఆత్మకూరు(ఎం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. రైతు మజ్జిగ అశోక్ పాడి గేదెను సోమవారం వ్యవసాయ బావి వద్ద మేతకు వదిలిపెట్టాడు. ఈ క్రమంలో గడ్డిమేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె రూ.70 వేల విలువ ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అశోక్ ప్రభుత్వాన్ని కోరాడు.

# రాత్రిపూట చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

- **నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో కేసులు**



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో ఆరుబయట నిద్రిస్తున్న వారే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను సూర్యాపేట జిల్లా సీసీఎస్, అర్వపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.5 లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అక్టోబరులో అర్వపల్లి మండలంలో వరుసగా రెండు చోరీలు జరిగాయి. సోమవారం అర్వపల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు వచ్చారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా కూలీలుగా పనిచేసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలవరం మండలం ఎదురులంక గ్రామానికి చెందిన ఓలేటి మహాలక్ష్మలరావు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్నమల్ల గ్రామానికి చెందిన గద్దెడ సురేంద్ర, తణుకు మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన అల్లేటి రాజేష్, వెదులూరు గ్రామానికి చెందిన డ్రైవర్ వెంద్ర రాఘవేంద్రరావులుగా గుర్తించారు. నలుగురు కలిసి రాత్రి సమయంలో ఆరుబయట నిద్రిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని విలువైన వెండి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్నట్లు అంగీకరించారు. గత నెలలో అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి, నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి సుమారు రూ.5 లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలతో పాటు రెండు బైక్‌లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులపై గతంలో తెలుగు రాష్ట్రాల్లోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీ కేసులు నమోదై ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం కనబరిచిన సీసీఎస్, అర్వపల్లి పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, నాగారం సీఐ నాగేశ్వర్‌రావు, అర్వపల్లి ఎస్‌ఐ ఈట సైదులు, సీసీఎస్ ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది చనగాని వెంకన్న, చామకూరి శ్రీనివాస్, విద్యాసాగర్, ఆనంద్, మల్లేష్, సుధీర్ పాల్గొన్నారు.

### అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ పల్టీ



డిండి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ పల్టీకొట్టింది. నల్లగొండ జిల్లా డిండి మండలం రత్నతండా నుంచి రైతు బాలునాయక్ తన 40 క్వింటాళ్ల పత్తిని ట్రాక్టర్‌లో తీసుకొని సోమవారం సీసీఐ కేంద్రానికి వెళ్తున్నాడు. ట్రాక్టర్ నగరదుబ్బ తండా శివారులోకి రాగానే అదుపుతప్పి ట్రాలీపల్టీ కొట్టింది. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ట్రాక్టర్ ట్రాలీని డ్రైవర్ అదుపుచేయలేకపోయాడు.

# పనిచేయని దడ్వాయిల యంత్రాలు



సూర్యాపేట మార్కెట్ కార్యాలయంలోని యంత్రాలు



మార్కెట్‌లో ధాన్యం రాశులు

భానుపురి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు రాక కొనసాగుతోంది. సీజన్‌తో పనిలేకుండా రైతులు మార్కెట్‌కు వరి, పెసళ్లు, కందులు, వేరుశనగ, జొన్నలు లాంటి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువస్తున్నారు. అయితే కాంటాలు వేయడంలో దడ్వాయిలు కీలకంగా వ్యవహరిస్తారు. అయితే దడ్వాయిలు వ్యవసాయ ఉత్పత్తులకు కాంటాలు వేసి ఈ-నామ్ రశీదు ఇచ్చే ఆనవాయితీ కొనసాగుతోంది. మిషన్లు పనిచేయడం లేదని నాలుగు నెలల నుంచి మూలకువేశారు. దీంతో రైతులు తీసుకువచ్చిన వ్యవసాయ ఉత్పత్తులు ఎన్ని బస్తాలు, ఎంత ధర, ఎంత డబ్బుల వివరాలు రశీదు మీద ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులకు చూపించుకునే పరిస్థితి లేదు. మిషన్లను బాగు చేయించాలని కొంతమంది కమీషనదారులు వేడుకుంటున్నా మరమ్మతు చేయించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో 68 మంది దడ్వాయిలు ఉండగా 68 మిషన్లు పనిచేయడం లేదని మూలకు పడేశారు. మార్కెట్‌లోని 14 షెడ్లకు వ్యవసాయ ఉత్పత్తులను రైతులు తీసుకువస్తారు. ప్రాధాన్యం ఉన్న మిషన్లను బాగు చేయించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

**మార్కెట్‌లో లభించిన ధరలు**

| బియ్యం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| బీపీటీ | రూ.2,151 | రూ.1,892 |
| బీపీటీ(పాతవి) | రూ.2,509 | రూ.1,629, |
| జైశ్రీరాం | రూ.2,621 | రూ.1,509 |
| జైశ్రీరాం(పాతవి) | రూ.2,929 | రూ.2,555, |
| ఐఆర్-64 | రూ.1,966 | రూ.1,673 |
| హెచ్‌ఎంటీ | రూ.2,309 | రూ.1,519 |

**మార్కెట్‌కు 20 వేల బస్తాల ధాన్యం**

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 20 వేల బస్తాల ధాన్యం వచ్చింది. 338 మంది రైతులు బీపీటీ, జైశ్రీరాం, ఐఆర్-64, హెచ్‌ఎంటీ, బీపీటీ పాత రకం, ఐఆర్-64 పాత రకం ధాన్యాలను 20 వేల బస్తాల ధాన్యాన్ని తీసుకువచ్చారు. కందులు, పెసళ్లు, వేరుశనగ, జొన్నలు, మినుములు సైతం 21 మంది రైతులు 219 బస్తాలను తీసుకువచ్చారు.

**మిషన్లకు మరమ్మతులు చేయిస్తాం**

ఈ సీజన్‌లో అత్యధికంగా ధాన్యం వచ్చింది. మార్కెట్ సిబ్బందిని షెడ్ల ఆరీగా ఉంచి ఎక్కడా రైతుకు నష్టం రాకుండా చూస్తున్నాం. మార్కెట్‌లో దడవాయిల యంత్రాలు మరమ్మతులకు వచ్చాయి. వాటికి మరమ్మతు చేయించడానికి మార్కెటింగ్ శాఖకు లేఖలు పంపించాం.

ఫసియొద్దిన్, సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి

### అంతర్ జిల్లా దొంగల అరెస్టు

చౌటుప్పల్‌రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లాలో పలు దొంగతనలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగలను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. వలిగొండ మండల కేంద్రానికి చెందిన కళ్లెం శ్రీను అలియాస్ డాన్ శ్రీను, భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లికు చెందిన దంతూరి పవన్, చౌటుప్పల్ పట్టణ కేంద్రం శివాజీనగర్‌కు చెందిన కళ్లెం సాయికుమార్, వలిగొండకు చెందిన గడిగె భరత్, చౌటుప్పల్ పట్టణ కేంద్రం హనుమాన్‌నగర్‌కు చెందిన కామాందుల తిరుపతి, పస్తం మల్లేష్‌లు ముఠాగా ఏర్పాడి యాదాద్రిభువనగిరి జిల్లాలో పలు దొంగతనలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఆదివారం తాళ్లసింగారం శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు బైక్‌లు, బంగారం చైన్, పుస్తెలతాడు, 7సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### ఇద్దరిపై కేసు

మద్దిరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల నల్లబెల్లంను పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా మద్దిరాల ఎక్సైజ్ ఎస్‌ఐ మూర్తి తెలిపారు. గుట్టకాడితండా గ్రామానికి చెందిన సపావత్ భాస్కర్, నేనావత్ సురేందర్ అక్రమంగా ద్విచక్రవాహనంపై 40కిలోల బెల్లంను తరలిస్తుండగా సమాచారం మేరకు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### కృష్ణానదిలో గల్లంతైన యువకుడు మృతి



ముజీబ్(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పులిచింతల ప్రాజెక్ట్ దిగువభాగంలో కృష్ణానదిలో ఆదివారం గల్లంతైన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన షేక్ ముజీబ్ మృతి చెందాడు. ఆ యువకుడి మృతదేహం సోమవారం సాయంత్రం 4 గంటలకు లభ్యమైంది. ఏపీలోని మాదిపాడు బల్లకట్టు వద్ద మత్స్యకార్మికులు చేపల కోసం వేటకు వెళ్లగా మృతదేహం లభ్యం కాగా జాలర్లు ఒడ్డుకు చేర్చారు. అనంతరం పల్నాడు జిల్లా అచ్చంపేట మండల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆదివారం సెలవురోజు కావడంతో విహారయాత్రకు వెళ్లిన ఆరుగురు స్నేహితులు నదిలో దిగి స్నానం చేస్తుండగా ముజీబ్ నదిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. ముజీబ్ మృతదేహం లభ్యం కావడంతో తల్లిదండ్రులు ముస్తఫా, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లింగగిరి గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

**మర్రికుంట వద్ద లారీ డ్రైవర్**

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మర్రికుంట వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఆదివారం గల్లంతయిన లారీడ్రైవర్ ఈట శ్రీకాంత్ మృతి చెందాడు. సోమవారం మృతదేహం లభ్యమైంది. పొనుగోడు రిజర్వాయర్ గేట్ల వద్ద మృతదేహం దొరికినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ ఆదివారం ఎడమకాల్వలో చేతులుశుభ్రం చేసుకునేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

### వ్యవసాయ శాఖ అధికారుల సస్పెన్షన్

మిర్యాలగూడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో నిబంధనలు ఉల్లంఘించిన వ్యవసాయ శాఖ అధికారులను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి సస్పెండ్ చేశారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి కాకుండా పొలం వద్దనే కొనుగోలు చేసి నేరుగా మిల్లులకు పంపారు. విషయం పత్రికల్లో కథనాల ద్వారా తెలుసుకున్న కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ మేరకు జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో డీసీవోలను పరిశీలించారు. విచారణలో పొలాల వద్ద నుంచి నేరుగా పట్టణంలోని శ్రీశివసాయి రైస్ ఇండస్ట్రీస్‌కు పంపినట్లు కలెక్టర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు. ఈమేరకు కలెక్టర్ ఆలగడప వ్యవసాయ విస్తరణ అధికారి ఆఫ్రిన్, వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి సీఈవో సైదులును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులు అమలులో ఉన్నంత వరకూ ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థలం వదలి వెళ్లకూడదని కలెక్టర్ ఆదేశించారు.

# నత్తనడకన సర్వీస్ రోడ్ల మరమ్మతు



చౌటుప్పల్‌లో సర్వీస్ రోడ్డుపై కంకర రాళ్లు

- ఏడాది క్రితమే పనులు ప్రారంభం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి

చౌటుప్పల్‌టౌన్,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై చేపట్టిన సర్వీస్ రోడ్ల మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగుతున్నా యి. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్ల మరమ్మతు పనులకు రెం డేళ్లు పడితే ఇక ఫ్లై ఓవర్‌ను నిర్మించేందుకు ఇంకా ఎన్నాళ్లు పడుతుందన్నా చర్చ సాగుతోంది. జాతీయ రహదారిపై రూ.114 కోట్లతో నిర్మించనున్నట్లు ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా రెండు కిలోమీటర్ల వంతున 4 కిలో మీటర్ల పొడవున ఉన్న సర్వీస్ రోడ్లను పటిష్టం చేసే ం దుకు మరమ్మతు పనులను 2024 జూన్ 20వ తేదీన మొదలు పెట్టారు. ఫ్లై ఓవర్‌ను నిర్మించే సమయంలో వాహనాలను ఈ సర్వీస్ రోడ్ల వెంట మళ్లించేందుకు మరమ్మతు పనులను చేస్తున్నారు. సర్వీస్ రోడ్ల మరమ్మతులను చేపట్టి 17 నెలలు గడుస్తున్నా కూడ పూ ర్తి చేయకపోవడంతో ప్రయాణికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### నామ మాత్రంగా పనులు

హైవేకు దక్షిణ భాగంలోని బాలాజీ ఎలక్ట్రికల్స్ నుంచి హనుమాన్‌నగర్ ప్రధాన రోడ్డు వరకు సుమారు ఒక కిలోమీటరు రోడ్డులో కంకర పనులు నామ మాత్రంగా జరుగుతున్నాయి. వాహనాల రాకపోకల సమయాల్లో కంకర రాళ్లు ఎగిరిపడుతూ ప్రజలకు.. వ్యాపారులకు ప్రాణ సంకటంగా మారాయి. మిగిలిన కిలో మీటరు పొడవున తారు వేశారు. ఉత్తర భాగం లో బస్‌స్టేషన్ దగ్గర సుమారు 100 మీటర్ల పొడవున కంకర వేసి వదిలి వేయడంతో ప్రమాదకరంగా మారింది. ఎంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వాహనదారులతో పాటు పాదాచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మిగిలిన రెండు కిలోమీటర్ల పొడవున తారు వేయడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. కాగా, పూర్తి స్థాయిలో సర్వీస్ రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయించి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

### అడ్డుగా విద్యుత్ తీగలు

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అడ్డుగా విద్యుత్ తీగలు ఉండడంతో సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారు. హై టెన్షన్ విద్యుత్ తీగలను తొలగించిన తరువాతనే ఇక్కడ పనులు జరిగేందుకు అవకాశం ఉంది.



విద్యుత్ తీగలతో నిలిచిన సర్వీస్ రోడ్డు పనులు

### ఫ్లై ఓవర్ పనులకు మట్టి పరీక్షలు ఓకే...

2024 జూలై మాసంలో ఫ్లై ఓవర్ నిర్మించే ప్రాంతంలో మట్టి పరీక్షలు నిర్వహించగా, నిర్మాణాలకు అనుకూలంగా వచ్చింది. ఫ్లై ఓవర్‌ను నిర్మించే ప్రాంతంలో పెద్ద గుంతలను తీసి మట్టి పరీక్షలను చేశారు. ప్రత్యేక బృం దం ఒక నెల రోజుల పాటు పట్టి పరీక్షలను నిర్వహించింది. ఫ్లై ఓవర్ ను మంజూరు చేయించడంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృషి ని ప్రజలు అభినందిస్తున్నారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణంతో పట్టణంలోని జా తీయ రహదారిపై నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ పనుల జాప్యంపై ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వరరావు ఫోన్ సంప్రదించడానికి యత్నించగా అందుబాటులోకి రాలేదు.

### పనుల జాప్యంతో ప్రయాణికులకు ఇబ్బందులు



హైవే సర్వీస్ రోడ్ల మరమ్మతు పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా మరమ్మతు పనులను పూర్తి చేయకపోవడం దురదృష్టకరం. వాహ నాలు రాకపోకలు సాగించే సమయాల్లో కంకరరాళ్లు ఎగిరిపడి పాదాచారులు ,చిరు వ్యాపారులకు తగులుతున్నాయి. కం కరరాళ్లు ఎగిరిపడి ప్రజలు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ తీసుకొని సర్వీస్ రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేయించాలి.

– కడారి కల్పన అయిలయ్య యాదవ్, బీజేపీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షురాలు

### మురుగు కాల్వల గుంతలతో ప్రమాదం

గాంధీపార్క్ సమీపంలో సర్వీస్ రోడ్డు- హైవేకు మధ్యలో ఉన్న మురుగు కాలువల గుంతలతో వాహనదారులతో పాటు పాదాచారులకు ప్ర మాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ఈ గుంతలలో ప్రయాణికులు పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన మురుగు కాలువ హైవేను దాటుతుంది. గత కొన్నేళ్లుగా ఈ కాలువ మూసుకుపోవడంతో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉండేది. వారం రోజుల క్రితం మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మురుగు కాలువను శుభ్రం చేయించడంతో చుట్టు పక్కల ప్రజ లు ఊపిరి పీల్చుకున్నారు. మురుగు కాలువను మా త్రం ఎన్‌హెచ్ఏఐ అధికారులు మరమ్మతులు చేయి ంచి గుంతలను పూడ్చి వేయవేయాలని స్థానిక లు కోరుతున్నారు.

## నేటి నుంచి బీసీ గురుకులాల క్రీడలు

నాగార్జునసాగర్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు అండర్-14,19 జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలో ఉన్న 14 బీసీ గురుకుల కళాశాలల, 16 గురుకుల పాఠశాలల నుంచి 600 మంది క్రీడా కారులు పాల్గొననున్నట్లు. క్రీడా పోటీలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఈవో భిక్షపతి, ఆర్‌సీవో సందర్శ, ఎంఈవో తరి రాములు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

## 14 నుంచి ఆస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆస్మిత ఖేల్ ఇండియా అథ్లెటిక్స్ లీగ్ నల్లగొండ జిల్లాస్థాయి అండర్-14,16 బాలికల పోటీలు ఈనెల 14వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల జగ్జీవన్, ప్రధాన కార్యదర్శి తగుళ్ల శంభులింగం సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించే ఈ పోటీల్లో అండర్-14 ట్రయథ్లన్-ఎలో 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, ట్రయథ్లక్-బిలో 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్‌త్రో, ట్రయథ్లక్-సిలో 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, 600 మీటర్ల పరుగు, కిడ్స్ జావెలిన్ పోటీలు ఉంటాయని పేర్కొ న్నారు.అండర్-16 లో 60 మీటర్ల పరుగు, 600 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్‌త్రో, జావెలిన్‌త్రో ఉంటుందని వివరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలను జాతీయస్థాయిలో పంజాబ్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపిక చేయనున్నట్లు వివరిం చారు. గ్రామీణ క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తైక్వాండో జాతీయ పోటీలకు రిఫరీగా ప్రణీత్

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : 8వ జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీ లకు రిఫరీగా నల్లగొండకు చెందిన తైక్వాండో కోచ్ అంబటి ప్రణీత్ ఎంపికయ్యారు. పంజాబ్‌లోని జలేంధర్‌లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే పోటీలకు ప్రణీత్ రిఫరీగా వ్యవహరించనున్నారు. అవకాశం కల్పించిన తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ. ప్రవీణ్‌కుమార్‌కు, జిల్లా సెక్రటరీ ఎండీ. యూనుస్ కమాల్‌కు ప్రణీత్ కృతజ్ఞతలు తెలిపారు.

## మహిమాన్వితం కొలనుపాక సోమేశ్వర క్షేత్రం

- జోగులాంబపీఠాధిపతి శివానందస్వామి
- మహా ప్రదక్షిణ కార్యక్రమం ఆరంభం



మహాప్రదక్షిణ ప్రారంభిస్తున్న జోగుళాంబ పీఠాధిపతి శివానందస్వామి

ఆలేరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితం కొలనుపాక సోమేశ్వర క్షేత్రమని జోగుళాంబ పీఠాధిపతి శివానందస్వామి అన్నారు. దేశంలోనే ప్రసిద్ధిగాంచిన చండీ కాంబ సహిత సోమేశ్వరాలయంలో ఆయన భక్తులతో కలిసి మహాప్రదక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయంభు సోమేశ్వర కోటి లింగేశ్వర స్వామి ఆలయం ఇక్ష్వాకులు కాకతీయుల కాలం నాటి నుంచి ప్రసిద్ధి చెందినదన్నారు. దేశంలోని పంచపీఠాల్లో మొదటి పీఠం కొలనుపాక అని ఇక్కడ ఆదిగురువులు రేణుకాచార్యులు పుట్టు లింగం నుంచి ఉద్భవించి దేశ కల్యాణార్థం కృషి చేశారన్నారు. ఆనాడు 108 కొలను ఉండేదని చక్రవర్తులు మహారాజులు సైతం ఈ దేవాలయాన్ని సందర్శించి తరించారన్నారు. అలాంటి మఠం నేడు నిత్య పూజలకు, ఆరాధనలకు నోచుకోలేకపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆలయానికి ఉన్న వేలాది ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఈ పీఠంలో ఉండాల్సిన పీఠాధిపతి ఇక్కడ ఉండకుండా కర్ణాటకలోని రంభాపురంలో ఉంటూ ఏమి చేస్తున్నారని ఆరోపించారు. కొలనుపాకలోని ఈ మొదటి పీఠం నిత్య పూజలు అందుకునేలా గ్రామస్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఏడాదికి ఒకసారి కర్ణాటక నుంచి వచ్చి జెండాలు ఎగురవేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేని రంభాపురిలోని పీఠాధిపతి ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే గ్రామస్థులే అభివృద్ధి చేసుకొని ఈ దేవాలయానికి నూతన శోభను తీసుకువస్తారన్నారు. లేదంటే దేవాదాయ శాఖనైనా ఈ దేవాలయాన్ని తమలో కలుపుకొని అభివృద్ధి పర్చాలన్నారు. మహాప్రదక్షణ కార్యక్రమంలో దేవాలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గంగుల శ్రీనివాస్, మోత్కూరు అయిలయ్య, గాండ్ల మఠం పూజారి సోమయ్యచారి, మామిడాల నర్సింహులు, మామిడాల అంజయ్య, సోమిరెడ్డి, మాధవరెడ్డి, ద్రౌపతిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, రాజులతో పాటు వివిధ పార్టీల నాయకులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పాతగుట్ట ఆలయ అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

- ఆమోదం తెలిపిన ఈవో

యాదగిరిగుట్ట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులను ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు ఆమోదం తెలిపారు. పాతగుట్ట, కొండపై ఉన్న ప్రధానాలయంలో సోమవారం ఆయన పర్యటించి పరిశీలించి కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా అద్దాల మండపం, ఆంజనేయస్వామి ఆలయం పునరుద్ధరణ, గుండం, మెట్ల దారి ఇరువైపులా రెలింగ్, షెడ్డు నిర్మాణం, ఆలయ పరిసరాల్లో ప్రహరీ, ఇతర సౌకర్యాల కోసం అదనంగా నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. ప్రధానాలయంలో ముందుగా ప్రోటోకాల్ కార్యాలయాన్ని సందర్శించి అతిథుల సంఖ్యను పరిమితం చేయాలని, భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

### శివాలయంలో ప్రసాద వితరణ ప్రారంభం

భక్తుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ప్రతి సోమవారం ప్రధానాలయంలో మాదిరి శివాలయంలో కూడా ప్రసాద వితరణ ప్రారంభించారు. ప్రసాదాల తయారీ కేంద్రాన్ని సందర్శించి వినియోగించే పదార్థాల్లో నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వాహణ మొదలగు అంశాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రసాదాల టికెట్ల కౌంటర్లను సందర్శించి టికెట్ల జారీలో వేగం పెంచి సమర్థతంగా నిర్వహించాలన్నారు. కియోస్కో యంత్రాల పనితీరును పరిశీలించి భక్తులను ఆరా తీశారు. క్యూలైన్లల్లో వేచి సమయం గణనీయంగా తగ్గిందని భక్తులు తెలిపారు. ఆయన వెంట ఏఈవోలు గజ్వేల్లి రఘు, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, నాగుల మహేష్‌గౌడ్, పర్యవేక్షకులు దీరావత్ రామరావునాయక్, మాచర్ల రాజన్‌బాబు ఉన్నారు.



పాతగుట్ట ఆలయం వద్ద సివిల్ విభాగం ఈఈ దయాకర్‌రెడ్డికి సూచనలు చేస్తున్న ఈవో వెంకట్రావు

## శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిఆలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలో స్పటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,80,271 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, సత్యదేవునికి 842 దంపతులు వ్రతాలు జరిగినట్లు పర్యవేక్షకుడు దొమ్మాట సురేందర్‌రెడ్డి తెలిపారు.



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## సారూ.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయరూ?

- ఎడ్లబండ్లపై పత్తి మూటలతో రైతుల నిరసన
- నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలులో ఘటన

గుర్రంపోడు/మర్రిగూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాము పండించిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎడ్ల బండ్లపై పత్తి మూటలతో రహదారిపై ఆందోళనకు దిగారు. సోమవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలులో ఈ సంఘటన జరిగింది. గుర్రంపోడు మండలంలో 41వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గ్రామంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో కొండమల్లేపల్లి, మునుగోడు ప్రాంతాలకు వెళ్లలేక దళారులకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయకపోవడం, దళారులు ధర తగ్గించి ఇస్తుండటంతో రైతులు సోమవారం నల్లగొండ - దేవరకొండ ప్రధాన రహదారి కొప్పోలు గ్రామం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండలంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. దళారులు పత్తికి మద్దతు ధర ఇవ్వకుండా అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లిందని, సాగుకు పెట్టుబడి వ్యయం పెరిగిందని అన్నారు. దళారులు ఇచ్చే ధరతో పత్తిని ఏరేందుకు కూలీలకు అయిన ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులకు తక్కువ ధరకు అమ్ముకోలేక వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే తమకు మద్దతు ధర దక్కుతుందన్నారు. కానీ ప్రభుత్వం, అధికారులు సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం లేదని అన్నారు. ఎడ్ల బండ్లపై పత్తి మూటలు తీసుకువచ్చి కొప్పోలు మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేయటంతో రహదారికి ఇరువైపులా సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పోలీసులు తహసీల్దార్, ఏవోలకు విషయాన్ని తెలియజేయగా రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు చేస్తున్న ఆందోళనను విరమింపజేసి పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



గుర్రంపోడు మండలం కొప్పోలులో పత్తి మూటలతో ధర్నా చేస్తున్న రైతులు

### సర్వర్ బిజీతో నిలిచిన కొనుగోళ్లు

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లిలోని సీసీఐ కేంద్రంలో సర్వర్ బిజీతో పత్తి కొనుగోళ్లు నిలిచి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్తి కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులు పత్తి మిల్లు వద్దకు పత్తిని తీసుకొని వచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సర్వర్ పనిచేయడంతో సిబ్బంది కొనుగోళ్లను ప్రారంభించారు.



మర్రిగూడలో నిలిచిన పత్తి వాహనాలు

### అందె శ్రీ మృతికి దిగ్భ్రాంతి : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, జయజయహే తెలంగాణ.. గీత రచయిత డాక్టర్ అందెశ్రీ మరణం పట్ల ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో కవిగా తన పాటలు, సాహిత్యంతో కీలకపాత్ర పోషించిన అందెశ్రీ మరణం ఈ ప్రాంతానికి తీరని లోటని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

### విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

చిట్యాలరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలను తీసుకోవాలని గుండ్రాంపల్లి జడ్పీహైస్కూల్ హెచ్ఎం రమాదేవి అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం దివీస్ లాబొరేటరీస్ సౌజన్యంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు జయంత్‌కుమార్, నరేష్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి సలహాలు, సూచనలు చేశారు. మందులతో పాటు నోట్‌బుక్కులు బ్యాగులు, సైన్స్ పరికరాలను అందజేశారు.

# సమస్యలు పరిష్కరించరూ..

**ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు**



నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి అంటూ... జిల్లా నలుమూల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో ప్రయాసాలకోర్చి వారం వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అనేకమంది హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై హాజరుకాగా మరి కొందరు సామాజిక అంశాలపై తరలి వచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. ఈ వారం మొత్తం 63కి పైగా రెవెన్యూ అంశాలపై వచ్చిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి.

**నా భూమి నాకు ఇప్పించండి**



నా వయస్సు 80 సంవత్సరాలు. నాకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలం క్రితం తన పేరుపై ఉన్న భూమిని ముగ్గురు కుమారులకు పంచి ఇచ్చి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాను. అప్పటి నుంచి నా మొదటి కుమారుడు, రెండో కుమారుడు నన్ను నానా ఇబ్బందులకు గురి చేయడంతో అధికారులను ఆశ్రయించగా వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి తనకు జీవన భృతి చెల్లించాలని ఆదేశించారు. అయినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం నా ఆరోగ్యం కూడా సరిగా లేనందున కుమార్తె ఇంటి వద్ద ఉండాల్సి వచ్చింది. వైద్య చికిత్స అందించేందుకు కూడా కుమారులు ముందుకు రావడం లేదు. చివరి దశలో కనీసం కన్న తల్లికి జీవనభృతి ఇవ్వనందున దయచేసి తన పేరిట ఉన్న భూమిని తిరిగి తనకు ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలి.

- రత్నమ్మ, బుద్ధారం, నల్లగొండ

**హద్దురాళ్లను నిర్ణయించండి**



నాకు మా గ్రామంలో సర్వే నెంబర్ 388లో వ్యవసాయ భూమి ఉంది. అయితే ఇందుకు సంబంధించిన హద్దు రాళ్ల నిర్ణయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి హద్దు రాళ్ల నిర్ణయించేందుకు దరఖాస్తు చేసుకున్నాను. వారం రోజులలోగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాల్సి ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దయచేసి న్యాయం చేయండి.

- కె. పాపయ్య, తాళ్లవెల్లంల, చిట్యాల

**దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**



మేము నిరుపేద ఎరుకల కులస్థులం. మా గ్రామంలో సర్వే నెంబర్ 229/2లో ఊరకుంట ఉంది, దాని పక్కనే మేము ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నాం. అయితే గ్రామానికి చెందిన వ్యక్తులు మా ఇంటిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా గత నెల 18వ తేదిన సదరు వ్యక్తులు మేము ఇంట్లో లేని సమయంలో మా ఇంటిపై దాడిచేసి మా పిల్లలను భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశాం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

- దుగ్గేపల్లి గ్రామస్థులు, త్రిపురారం

## చెర్వుగట్టులో ప్రసాద పంపిణీ ప్రారంభం

●ప్రారంభించిన ఈవో మోహన్‌బాబు



ఉచిత నైవేద్య ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్న ఈవో మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర ఆలయంలో భక్తులకు ఉచిత నైవేద్య ప్రసాద పంపిణీ ప్రారంభమైంది. భక్తుల కోరిక మేరకు స్వామివారి నైవేద్య ప్రసాద పంపిణీని (పులిహోర) పునఃప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో సల్వాది మోహన్‌బాబు సోమవారం ప్రారంభించారు. మూడేళ్ల క్రితం ప్రసాదం పంపిణీ చేసినప్పటికీ అనివార్య కారణాలతో నిలిపివేశారు. తొలిరోజు ఐదు కిలోల పులిహోరను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రధాన దేవాలయాలైన శ్రీశైలం, విజయవాడ ఇతర దేవాలయాల్లో కొనసాగుతున్న నైవేద్య ప్రసాద పంపిణీ మాదిరిగానే చెర్వుగట్టు ఆలయంలో కూడా ఇక నుంచి మూలవిరాట్టు దర్శనం అనంతరం ఆలయం నుంచి నిష్క్రమించే భక్తులకు స్వామివారి ఉచిత నైవేద్య ప్రసాద పంపిణీని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, శ్రీకాంత్ శర్మ, నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి, ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దేవసింగ్

నాంపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాంపల్లి తహసీల్దార్ దేవసింగ్ కోరారు. మండలంలోని పెద్దాపురంలో ఆకా సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ ఇందిరతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు కల్లాలలోనే వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని పెళ్లలు, తాలులేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు కార్యక్రమంలో లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజలింగం, మండల వ్యవసాయశాఖ అధికారి బండారు శివ, కోటేష్, ఏఈవో జగన్, విజయ్‌కుమార్, భవాని, వసుంధర అధికారులు పాల్గొన్నారు.

## దర్వేశిపురంలో సామూహిక కుంకుమ పూజలు

కనగల్, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాస భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆలయ అర్చకులు దామోదర్‌రావు, ఉమమహేశ్వర్‌రావ్‌ల ఆధ్వర్యంలో ఆర్య వైశ్య సంఘం మహిళలు సోమవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర సారె ఒడిబియ్యం బోన నైవేద్యాలను సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. శివుడి విగ్రహం వద్ద ప్రమిదలు వెలిగించి దీపారాధన చేసారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

## చండూరు వైద్యులపై చర్యలు తీసుకోవాలి

చండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చండూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో సక్రమంగా విధులు నిర్వహించకుండా డుమ్మాలు కొడుతున్న ఇద్దరు వైద్యులను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నారపాక అంజి మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగులు ఆసుపత్రికి వెళ్తే పట్టించుకోకుండా, చీదరించుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని అన్నారు.. సమావేశంలో నారపాక లక్ష్మణ్‌మాదిగ, పాలడుగు అనిల్‌మాదిగ, నారపాలక రమేష్‌మాదిగ, ఊర యాదగిరిమాదిగ పాల్గొన్నారు.

## ఉర్సుకు నిర్దిష్ట సమయం ఉండాలి : బీజేపీ



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉర్సుకు నిర్దిష్ట సమయం ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను 11 రోజుల నుంచి 13 రోజుల వరకు నిమజ్జనం చేయాలని నిబంధన ఉందని అయితే జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సమయం లేకుండా ఉత్సవాలు నిర్వహించడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉర్సు పేరిట అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు, రోహిగ్యాలకు వేదికగా తయారైందని తెలిపారు. తక్షణమే నిర్దిష్ట సమయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## 'జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థిదే గెలుపు'

మర్రిగూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు వేనేపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ దొందు దొందేనని ప్రజలు వీరిని నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని అన్ని సర్వేల ద్వారా వెల్లడైందన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

నల్లగొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వట్టికోట ఆళ్వారు స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయిలో ఇంటర్ డిగ్రీ పీజీ విద్యార్థులకు, హైస్కూల్ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, కవితలు, పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్ లో బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మట్టికవి విమర్శకులు ప్రొఫెసర్ డాక్టర్ బెల్లి యాదయ్య, మెరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, మునాసు వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై జ్ఞాపికలు, పుస్తకాలు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సలీమా, సంఘ సేవకులు అద్దంకి కృష్ణమాచార్య, యోగా గురువు మాదగాని శంకరయ్య, తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ఏబూషి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పెరగనున్న కమ్యూనిస్టుల ప్రాబల్యం : ఎమ్మెల్సీ సత్యం




సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మునుగోడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఓసోషలిస్టు విజయం శుభసూచికమని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఈ చారిత్రాత్మక తీర్పు రానున్న కాలంలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలంలో ప్రజలు తమకు ఆదరణ చూపేది ఏ పార్టీలు అని గమనిస్తున్నారని అన్నారు. అందుకు అమెరికాలో సోషలిస్టు విజయం సాధించటమే నిదర్శనమన్నారు. సీపీఐ 100వసంతాల ప్రయాణంలో ఆద్యంతం ప్రజల పక్షాన పోరాడన చరిత్ర అని కొనియాడారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెబరు 26న భారీ బహిరంగ సభ నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈసభ జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 15న జోగులాంబ- గద్వాల జిల్లాలో ప్రచార జాత ప్రారంభం కానుందన్నారు. ఈనెల 17న డిండికి చేరుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా ఖమ్మానికి వెళ్లనుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయలని కోరారు. వర్షాల కారంగా దెబ్బతిని పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీర్పారి వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యుడు సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, బొమ్మరబోయిన లాలు, గోస్కొండ లింగయ్య, మందుల పాండు, వనం వెంకన్న, బండమీది యాదయ్య, ఉప్పునూతల రమేష్, కాయితం వెంకన్న, సత్తమ్మ, దుబ్బ వెంకన్న, ఉప్పరబోయిన సతీష్, శంకర్, కట్ట ధశరథ, ఉదయ్, పరమేశ, ఎల్లయ్య, అశోక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ ఆకస్మిక మృతి సాహితీ రంగానికి తీరనిలోటు

నల్లగొండ కల్చరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం గర్వించదగ్గ ప్రముఖ కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సాహితీరంగానికి తీరని లోటని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందెశ్రీ మృతి అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన రచించిన తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ తాను 2014లో ప్రచురించిన తెలంగాణ తల్లి కవితా సంకలనంలో అచ్చుయినట్లు గుర్తుచేశారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అందెశ్రీ అందజేశానని, ఆ సమయంతో ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా సాహితీవేత్తలు పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, పెందోట సోము, బండారు శంకర్, బుచ్చిరెడ్డి, శంకరయ్య, లింగమూర్తి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి అందెశ్రీ మృతిపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ కవిగా, ప్రజాచైతన్యం రగిలించి ప్రజల హృదయాల్లో నిలిచి పోయాడని గుర్తుచేశారు.

**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన కవి, రచయిత అందెశ్రీ**



నకిరేకల్‌లో అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్: కవి, రచయిత, సాహితివేత్త, గాన కోయిల, నంది అవార్డు, పద్మశ్రీ గ్రహీత అందెశ్రీ మృతి పట్ల నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో పలువురు ఆసీనులను చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ జిల్లా కన్వీనర్ చెట్టిపల్లి కాశీరామ్, బీసీపీ జిల్లా నాయకుడు బొల్లికొండ లింగయ్య, అంబటి చిరంజీవి, గజ్జి రవి, మామిడి ఎల్లయ్య, పుట్ట సత్యం, సైదులు, మేడిపల్లి సైదులు, కారింగుల యాదగిరి, గుత్తా వెంకట్‌రెడ్డి, మల్లేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణకు ఆమోదం

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్ల తరువాత యాంత్రీకరణ పథకం అమలవుతున్న నేపథ్యంలో పండుగలాగా కార్యక్రమాన్ని నిర్వహించి యంత్రాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా పనిముట్లకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు త్వరలో ఉమ్మడి జిల్లా స్థాయిలో అవగాహన సదస్సులతో పాటు ప్రదర్శనలు నిర్వహించే అవకాశం ఉంది. పనిముట్లు, యంత్రాలు తయారుచేసే సంస్థల సహకారంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ అనుబంధ రంగాలను భాగస్వాములను చేయనున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేందుకు ఈ సదస్సులను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందాలంటే కూలీల కొరత ఉన్న ప్రస్తుత సమయంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. అధికారులు ఏర్పాటు చేసే ప్రదర్శనలో అత్యధికంగా రైతులకు ప్రయోజనం కలిగే పనిముట్లను ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన రెండు రోజులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ ప్రదర్శనలో పురుగు మందులను డ్రోన్ల ద్వారా పిచికారీ చేసేలా రైతులకు అవగాహన కల్పించనున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలను రైతులకు అందజేస్తాం. ఇప్పటికే మండలస్థాయి కమిటీల నుంచి నివేదికలు రావడంతో ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు వాటిని పంపాం. ఈ నెల 14వ తేదీ లోగా జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. యాంత్రీకరణ పథకం నిరంతరంగా కొనసాగనుంది. ప్రతీ రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేయడం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయం చేయడంతోపాటు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

## చంద్రగిరి విల్లాస్‌లో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

రామగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని చంద్రగిరి విల్లాస్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కీర్తనలు, భజనలు చేస్తూ వీధుల్లో తిరిగారు. అనంతరం కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు నరసింహచార్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో చేసే పూజలు అత్యంత పుణ్యఫలాలను ఇస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ భక్తిభావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గోవిందు సుధాకర్, బాసాని మురళీకృష్ణ, వెంకట్, పున్న కృష్ణ, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, రాజు, శ్రీను, రవీంద్రనాథ్, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, తోటకూరి యాదయ్య, చౌడోజు సైదాచారి, అంబటి వరదరాజులు, కల్పన, ధనలక్ష్మి, శిరీష మంజుల, శ్రీలక్ష్మి, కనకవల్లి పాల్గొన్నారు.

## పరిహారం అందేనా?

(5వ పేజీ తరువాయి)

అందలేదు. తాజాగా మొంథా తుపాన్ బాధితులతో పాటు గత యాసంగిలో పంట నష్టపోయిన తమకు పరిహారాన్ని కలిపి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**తరచూ నష్టపోతున్నా..**

అకాల వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో ప్రతి సీజన్‌లోనూ రైతులు పంటలు నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడం లేదు. భారీగా నష్టపోయిన సందర్భాల్లోనూ కంటితుడుపుగా పరిహారమిస్తున్నారే తప్ప, నష్టపోయిన ప్రతీ సందర్భంలో చెల్లించకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. జిల్లాలో 2023 మార్చిలో కురిసిన అకాలవర్షాలతో 371 ఎకరాల్లో పంట నష్టపోగా, ఆ రైతులకు రూ.37.16లక్షల పరిహారమిచ్చారు. ఆ తర్వాత తిరిగి 2024 ఏప్రిల్‌లో 32 ఎకరాల్లో, సెప్టెంబరులో 413 ఎకరాల్లో పంట నష్టపోగా, ఈ రెండు సందర్భాల్లో కలిపి సుమారు రూ.44.55లక్షల పరిహారాన్ని వ్యవసాయశాఖ నివేదించినా నిధులు రాలేదు.

2025 ఏప్రిల్‌లో యాసంగి సీజన్‌లో పంట నష్టం జరగ్గా, పరిహారం ఇవ్వలేదు. రాష్ట్రంలో పంటల బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాలు సక్రమంగా అమలుకాకపోవడం వల్లే పంటలు నష్టపోయినా రైతులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

## యాదవ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పరమేష్



పరమేష్ యాదవ్

కనగల్, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి) అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన మండలి పరమేష్‌యాదవ్ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు ఆ సంఘం జి ల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్ పరమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ పెద్దల సహకారంతో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా కళలను కాపాడుకుందాం

మర్రిగూడ, శాలిగౌరారం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా కళలను కాపాడుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. ప్రజానాట్యమండలి మర్రిగూడ మండల మూడవ మహాసభ గడ్డం రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా కవి రచయిత అయిన అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పించి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ప్రజానాట్యమండలి, కళ కోసం కాదు కళ ప్రజల కోసం అనే నినాదంతో పనిచేస్తోందని అన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కోసం కార్మికుల కనీస వేతనాలపై మహిళలపై జరుగుతున్న దాడులు హత్యలు, అత్యాచారాలపై ఆటపాటల ద్వారా ప్రజలను మేల్కొలుపుతుందని అన్నారు. డిసెంబరు 6, 7తేదీలలో మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్వహించే ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం రాంబాబు ఏర్పుల ఎల్లయ్య, ఏరుకొండ రాఘవేంద్ర, కవిత, వడ్డె లోకేష్, వడ్డే హరికృష్ణ, నక్క ప్రమీల, బరిగల కృష్ణ పాల్గొన్నారు.


**ప్రాచీన కళలను కాపాడుకోవాలి**

శాలిగౌరారం: అంతరించిపోతున్న ప్రాచీన కళలను కాపాడుకోవాలని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజానాట్య మండలి మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంప్రదాయ జానపద కళారూపాలను కబళించి వేస్తున్నందున పూర్వకళలు అంతరిస్తున్నవన్నారు. కళలే ఆధారమైన వారి బతుకులు దిక్కుతోచకుండా పోతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదాయ కళలను ప్రోత్సహించాలని కోరారు. కళాకారులకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, కళాకారులకు గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు బట్ట రామచంద్రు, నాయకులు ఎర్ర శీను, గద్దపాటి రాము, దాసరి శంకర్, నిమ్మల రవి, వివిధ ప్రజాసంఘాల నాయకులు చలకాని మల్లయ్య, డెంకెల లింగయ్య, రావుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉట్కూరు రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేక ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా తెగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతున్న శాలిగౌరారం మండలం ఉట్కూర్ నుంచి బండమీదిగూడెం వరకు రోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 1వ తేదీన ఊరికి వెళ్లేదెలా..? అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన పంచాయతీ రాజ్ విభాగం అధికారులు ఉపాధిహామీ ఈజీఎస్ నిధుల నుంచి రూ.13 లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ ప్రారంభించారు.

## పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన చంద్ర పుల్లారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క

నకిరేకల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల విముక్తి కోసం చంద్ర పుల్లారెడ్డి నిరంతరం పోరాటం చేశారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం వెలుగులోకి పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యమ నిర్మాణ క్రమంలో చంద్ర పుల్లారెడ్డి ఎంతో పోరాటం చేశారన్నారు. చార్ మంజూదర్, సత్యనారాయణసింగ్, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, తరిమిల నాగిరెడ్డి పోరాటాలతో ఉద్యమం ముందుకెళ్లిందన్నారు. దోపిడీ, పీడిత, అసమానతలు రద్దు కావాలని, ఎంతో పోరాటాలు చేసిన వ్యక్తిని మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, న్యాయవాది కట్ట భగవంత్‌రెడ్డి, పటోల్ల నాగిరెడ్డి, సదానందం, అనిత, పల్లెబోయిన జాని, పల్స యాదగిరి, బెల్లి నాగరాజు, సైదులు, బొమ్మకంటి కొమురయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 589 (309.0510) | 51,680 | 51,680 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.95 (4.18) | 4,132.84 | 3,983.93 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.818 (43.9377) | 38,080 | 17,000 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



# పరిహారం అందేనా?

- మొంథా తుఫాన్ బాధిత రైతుల ఎదురుచూపు
- 61,511 ఎకరాల్లో పంటనష్టం
- అంచనావేసి పంపిన వ్యవసాయశాఖ
- తరచూ నష్టం వాటిల్లుతున్నా అందని పరిహారం

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పంట చేతికొచ్చేదశలో మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. రైతులకు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటివరకు ప్రతిపాదనల దశకే పరిమితమవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ పరిహారం చెల్లించలేదని, ఈసారి భారీగానష్టం వాటిల్లడంతో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ప్రధానంగా తుఫాన్ ప్రభావంతో వరి, పత్తి రైతులు అధికంగా నష్టపోయారు. పరిహారాన్ని సైతం కంటితుడుపు చర్యలాగాక ఉపశమనం కల్పించేలా ఇవ్వాలని డిమాండ్ రైతులు చేస్తున్నారు.

### 61,511 ఎకరాల్లో పంటనష్టం

జిల్లాలో అక్టోబరులో వచ్చిన మొంథా తుఫాన్ కారణంగా 310 గ్రామాల్లో 30,359 మంది రైతులు పంటనష్టపోయినట్లు వ్యవసాయశాఖ నివేదించింది. జిల్లా వ్యాప్తంగా 35,487 ఎకరాల్లో వరి, 25,919 ఎకరాల్లో పత్తి, మరో 105 ఎకరాల్లో మిరప పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తం 61,511 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు నిర్ధారించిన వ్యవసాయశాఖాధికారులు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారమిస్తే, రూ.61.51కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంటుందని తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. అయితే రైతులు మాత్రం ఈసారి పంటనష్టం ఎక్కువగా జరిగిందని, దాదాపు 50శాతం మేర దిగుబడులు తగ్గాయని, పత్తి పరిస్థితి మరీ దారుణంగా ఉందని, ఈ దఫా పరిహారాన్ని ఎకరాకు కనీసం రూ.25వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తుఫానుతో పాటు ఆగస్టులోనూ వర్షాలతో జిల్లాలో 11వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గడచిన యాసంగి సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాల కారణంతో జిల్లాలో 726.30 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనావేశారు. అందుకు రూ.72.69లక్షలు పరిహారంగా చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు

- మిగతా 8వ పేజీలో...

### రైతులకు పరిహారం చెల్లించాలి



మొంథా తుఫాన్‌తో జిల్లాలో వరి, పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గతంలోనూ పంటలు నష్టపోతే జిల్లా రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఈసారి భారీగా జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. తక్షణమే పంట నష్టపరిహారం అందజేయాలి. గత యాసంగిలో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలి.

- డి.గంగాధర్, బీజేపీ నేత, తిప్పర్తి

## ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

మంత్రులు ఉత్తమ్, తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

నల్లగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం,పత్తి, సోయా తదితర పంటల కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మా ట్లాడారు. అన్ని రకాల పంటల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నా రు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అవసరమైనం త త్వరగా తరలించాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలను సిద్ధంగా ఉంచాలన్నారు. మిల్లర్లు, కాంట్రాక్టర్లు, హమాలీలతో ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు రూ.160కోట్లు చెల్లించామని, ఇంకా రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. వర్షాలతో 4,600 మెట్రిక్‌టన్నుల తడిసిన ధాన్యాన్ని కూడా మిల్లర్లు కొనుగోలు చేశారని తెలిపారు. పత్తి తేమను పరిశీలించేందుకు 83 యంత్రాలు కావాలని, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎల్-1 కేంద్రాలు నల్లగొండలోనే ఉన్నందున యంత్రాల కొనుగోలుకు అనుమతి కావాలని కోరారు. దీంతో మంత్రి తుమ్మల తక్షణమే యంత్రాలను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో పత్తి సేకరణలో భాగంగా 23 కేంద్రాలకు, 15 మిల్లుల్లో ఇప్పటి వరకే ప్రారంభించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# యాంత్రీకరణకు ఆమోదం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో యాంత్రీకరణ పథకం ఓ కొలిక్కి రాగా, మండల స్థాయిలోని త్రిమెన్ కమిటీల ఆమోదం కూడా పూర్తయింది. దీంతో ఉమ్మడి జిల్లాలకు చెందిన మండల కమిటీల జాబితాలు సైతం కలెక్టరేట్‌కు చేరాయి. ఈ వారంలోగా జిల్లాస్థాయి కమిటీ ఆమోదం అనంతరం తుది జాబితా వెల్లడించనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు రూ.6.18కోట్లు కేటాయించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- మండల కమిటీల నుంచి చేరిన నివేదిక
- వారంలోగా జిల్లాస్థాయి కమిటీ నుంచి తుది జాబితా
- ఉమ్మడి జిల్లాకు రూ.6.18 కోట్లు కేటాయింపు

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ఏర్పాటు అనంతరం గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను కొనసాగించింది. ఆ తరువాత ఆరేళ్లుగా ఈ పథకం నిలిచింది. దీంతో ప్రోత్సాహం కరువై రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండా పోయాయి. రాష్ట్ర ఏర్పాటు అనంతరం గత ప్రభుత్వం నాలుగేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణన పథకాన్ని కొనసాగించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల సుమారు రూ.50కోట్లను కేటాయించింది. అయితే ఆ తరువాత పథకం నిలిచిపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం అమలుకు నిర్ణయం తీసుకొని నిధులు కేటాయించింది. అయితే రెండు సార్లు వివిధ కారణాలతో పథకం అమలు వాయిదాపడింది. చివరికి తాజాగా, ఈ పథకం అమలులోకి వచ్చింది. ఈ పథకం కింద ఎంపికైనా రైతుల నుంచి అధికారులు డీడీలు సేకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీపై పరికరాలు ఇవ్వనుండగా, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీపై పరికరాలు అందించనున్నారు.

### యాసంగి ప్రారంభంలోగా పరికరాలు

ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించమేగాక ఈ యాసంగి నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు అందజేయాలని నిర్ణయించింది. అయితే కొంత ఆలస్యమైనప్పటికీ సీజన్ ప్రారంభంలోనే రైతుల నుంచి డీడీలు తీసుకొని వారికి రాయితీపై పరికరాలు అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేయడమేగాక జిల్లాల వారీగా యంత్రాలకు రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారుల నుంచి నివేదికలు తీసుకొని అందుకు అనుగుణంగా నిధులు కేటాయించింది.

### మేళా ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను అధికారులు రూపొందించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, కిసాన్ డ్రోన్లతో పాటు ఇతర యంత్రాలనూ పంపిణీచేయనున్నారు. 2018నుంచి 2023 వరకు ఈ పథకం నిలిచిపోవడంతో యంత్రాలు రాక రైతులు ఇబ్బందులను ఎదుర్కొన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మేళా నిర్వహించి రైతులకు పరికరాలు అందించాలని భావిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది...

- మిగతా 8వ పేజీలో...

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ అనే విష సంస్కృతికి దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. జూనియర్లు, సీనియర్లు అనే బేధం విడనాడి నేటి సీనియర్లే ఒకప్పటి జూనియర్లు అనే విషయం మర్చిపోవద్దన్నారు. ర్యాగింగ్ పాల్పడిన వారిపై కేసు నమోదైతే ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. చట్టాలు పటిష్టంగా ఉన్నాయన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి, ఎస్బీసీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదులు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీ శరత్ చంద్రపవార్ పలు ఫిర్యాదులను పరిశీలించడంతో పాటు ఆర్జీదారులతో నేరుగా మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## 'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):'ప్రజావాణి' ఫిర్యాదులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. ఫిర్యాదు పరిష్కారం కాకుంటే వివరాలను తెలియజేయాలన్నారు. మొత్తం 94 ఫిర్యాదులు రాగా, అందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందినవి 63 ఉన్నాయి. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్ రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి

రోడ్డు భద్రతను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, దీంతో పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మానవ తప్పిదాలతో ప్రమాదాలు జరగకుండా చూడాలని, అందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి పోలీస్‌శాఖ గుర్తించిన బ్లాక్ స్పాట్లు, సూచించిన ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల వర్షాలతో చిట్యాల అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి ట్రాఫిక్‌జామ్ ఏర్పడిందని, దీనిపై ఇరిగేషన్, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమస్య ఇనుపాముల వద్ద కూడా గుర్తించినట్లు పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మర్రిగూడ బైపాస్ వద్ద రోడ్డుపై గుంతలను పూడ్చాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీస్‌శాఖ ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తోందన్నారు. వీటిపై తక్షణం స్పందించి ప్రమాదాలను నివారించాలన్నారు. చిట్యాల అండర్ పాస్ వద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్నారు. సర్వీస్ రోడ్లు లేకుండా పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్, వైఎస్ఆర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కె.జానీరెడ్డి, డీఈవో భిక్షపతి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఎస్పీ శివరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌కు జాగృతి అధ్యక్షురాలు

# కవిత రాక నేడు



నాగార్జునసాగర్,నవంబరు10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం సాగర్ నియో.క వర్గంలో పర్యటిస్తారని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి లింగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ నియోజక వర్గంలో జరుగుతున్న సుంకిశాల, నెల్లికల్ ఎత్తి పోతల పథకం పనులను ఆమె పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి మార్గ మధ్యంలో పలు ప్రాజెక్టులను సందర్శిస్తూ మధ్యాహ్నం 3 గంటలకు సుంకిశాలకు వచ్చి అక్కడ నుంచి నెల్లికల్లు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే మీడియాతో మాట్లడతారని ఆయన తెలిపారు.

దేవరకొండ: జాగృతి అధ్యక్షురాలు కవిత చింతపల్లి మండలం కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టును సందర్శిస్తారని జాగృతి రాష్ట్ర కార్యదర్శి అశోక్‌యాదవ్ ఒక ప్రటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు దేవరకొండ మండలం కొమ్మెపల్లి గురుకుల పాఠశాలను, మధ్యాహ్నం 1 గంటకు నక్కలగండి ప్రాజెక్టును పరిశీలిస్తారని తెలిపారు. ముంపు రైతులతో మాట్లాడతారని పేర్కొన్నారు.

## చెర్వుగట్టు క్షేత్రంపై కార్తీక భక్తుల రద్దీ



చెర్వుగట్టు ప్రధానాలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం సోమవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గుట్ట నిండా ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కన్పించింది. స్వామి వారి పుష్కరిణిలో కార్తీక స్నానమాచరించిన భక్తులు తొలుత కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం సర్వ దర్శనం, ప్రత్యేక దర్శన మార్గాల ద్వారా భక్తులు మూలవిరాట్టు జడల రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మూడుగుండ్లపై ఉన్న శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. పాదరక్షల మొక్కు తీర్చుకున్నా రు. సామూహిక సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో మోహన్‌బాబు తెలిపారు.

### ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ

కార్తీక సోమవారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో ఘాట్‌రోడ్‌పై రాకపోలకు అసౌకర్యం కలగకుండా నార్కట్‌పల్లి పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఎస్ఐ యాదగిరి నేతృత్వంలో పోలీసులు ఘాట్ రోడ్‌పై ఒకదానికి ఒకటి ఎదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గుట్ట దిగుతుండగా మొదటి మలుపు వద్ద నాలుగ చక్రాల వాహనాలను నిలిపివేశారు. వివిధ ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు కూడా ఘాట్‌రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఘాట్‌రోడ్డుపై ఎదురయ్యే ట్రాఫిక్ సమస్య కొంత తీరింది.

## 90 శాతం వాటా దక్కాల్సిందే

బీసీ ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్

నల్లగొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాజంలో 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలకు విద్య ఉపాధి రాజకీయ వ్యాపార రంగాల్లో, భూమిలోను, సమస్త రంగాల్లో సబ్బండ వర్గాలకు 90 శాతం వాటా దక్కల్సిందేనని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివాంజనేయ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా అగ్రకులాలు 10శాతం ఉన్నామని అంగీకరించి, చట్టం చేసుకున్నారు కాబట్టి 10 శాతం లోపే విద్య ఉపాధి రాజకీయాల్లో రిజర్వేషన్లు పొందాలని, మిగతా 90 శాతం వాటా అణగారిన వర్గాలకే చెందాలని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య భారతంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అగ్రకుల రెడ్డి, వెలమ, కమ్మ, కరణం భూస్వామ్య దొరల కబంధ హస్తాల్లో తెలంగాణలోని సబ్బండ వర్గాల జీవితాలు బందీ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం కాదు 50శాతం విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని, ఇది ప్రజాస్వామ్య, రాజ్యాంగ బద్ధ హక్కు అని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్. నాగం కుమార స్వామి, జర్నలిస్ట్ విఠల్, బాలరాజు గౌడ్, జేఏసీ రాష్ట్ర నాయకులు వినోద్ యాదవ్, రాఘవేంద్ర ముదిరాజ్, జిల్లా జేఏసీ అధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బరిగల దుర్గాప్రసాద్ మహారాజ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యావంతులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

### అందెశ్రీ మృతి సాహితీరంగానికి తీరనిలోటు : ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి సాహితీరంగానికి తీరనిలోటని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ రాసిన అందెశ్రీ మృతి బాధాకరమన్నారు. అందెశ్రీ మృతి పట్ల దేవరకొండ నియోజకవర్గ కవులు, రచయితలు పర్సా వాసుదేవరావు, రంజాన్‌బేగ్, రంగరాజు, రవికుమార్, సరేశ్వర్‌యాదవ్, పెంటోజీ, వెంకటరమణ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

### చింతపల్లి ఎంపీవోగా ఇందూజ బాధ్యతల స్వీకరణ



చింతపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల పంచాయతీ అధికారిగా ఎన్.ఇందూజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రవీణ్ శ్రీధర్ నల్లగొండ డీఆర్‌డీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇందూజ గ్రూప్-2లో ఎంపికై చింతపల్లిలో విధులు నిర్వహించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తానన్నారు.

## క్రీడల్లో రాణిస్తే అద్భుత అవకాశాలు




విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే అద్భుత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ అన్నారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్న శాస్త్ర పాఠశాల విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అపర్ణ గోల్డ్ మెడల్, ఆనందరూప ఆరెంజ్ బెల్ట్, స్నేహ ఎల్లో బెల్ట్ సాధించడం ఆదర్శనీయమన్నారు. అభిరాం, లత్యశ్రీ, రిషి, సంయుక్త పోటీల్లో రాణించి పతకాలతో పాటు బెల్టులు, మెరిట్ సర్టిఫికెట్స్ సాధించినట్లు తెలిపారు. సుమన్ ఇండియా చోటోఖాన్ అకాడమీలో శిక్షణ పొందిన వేలాది మంది విద్యార్థులు కరాటేలో రాణిస్తూ పట్టణానికి గుర్తింపు తేవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధు, పీఈటీలు అమృత, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

చింతపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ (మాల్) చెందిన మల్లోజు కిరణ్‌చారి (గురుస్వామి) ఆధ్వర్యంలో స్వగృహంలో అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రాంగణంలో గణపతి పూజ, లక్ష్మీదేవి సహిత సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, మల్లోజు జగదీశ్వరాచారి, మట్ట యాదయ్యగౌడ్ జంగయ్య, మల్లోజు ఆచారి సతీమణి లక్ష్మమ్మ, తేజస్వీని, బాదేపల్లి శ్రీకాంత్, తలారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



లక్ష్మీదేవిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

గుర్రంపోడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పోలు, లక్ష్మీదేవిగూడెం, జిన్నాయిచింత గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో కంచర్ల మాధవరెడ్డి, ఆర్ఐ నజీర్, ఏఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



శివాలయంలో ఆకాశదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దేవరకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని నందీశ్వరఆలయం, మార్కండేయస్వామి, పాత శివాలయంలో సోమవారం కార్తీక మాసం 3వ సోమవారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళలు, భక్తులు దేవాలయాలకు చేరుకొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. నందీశ్వర ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు సురభి కృష్ణమూర్తిశర్మ ఆకాశదీపోత్సవ కార్యక్రమం నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని కమలాపూర్ వీరభద్ర స్వామి దేవాలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు.

**కొండమల్లేపల్లి:** కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో నీల లక్ష్మయ్య, విజయ్, దేవాలయ పురోహితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటం

కొండమల్లేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఏబీవీపీ నల్లగొండ విభాగ్ ప్రముఖ్ కత్తుల ప్రమోద్ అన్నారు. కొండమల్లేపల్లిలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొండమల్లేపల్లి కార్యదర్శిగా పర్వతం దినేష్, సంయుక్త కార్యదర్శులు ఎన్. స్పందన, కె.వైష్ణవి. పి.మేఘనకుమార్, గణేష్, హేమంత్, సాయిచరణ్, వైస్ ప్రెసిడెంట్‌గా శిరీష, నందిని, మురళి, లక్ష్మణ్, రాకేష్, రాఘవేంద్ర, సందీప్, నగర గర్ల్స్ కన్వీనర్‌గా బి.సుస్మిత, అనుష్క, నగర సోషల్ మీడియా కన్వీనర్‌గా చరణ్, స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా మహేష్, హారిఫ్ మరికొంత మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యలమల గోపీచంద్, కొత్త అఖిల్, దమ్ముజు అమిత్‌తేజ్, భూషరాజు రాకేష్, శివ, దయాకర్, ప్రేమ్ పాల్గొన్నారు.

## పరిహారం అందేనా?

(5వ పేజీ తరువాయి)

అందలేదు. తాజాగా మొంథా తుపాన్ బాధితులతో పాటు గత యాసంగిలో పంట నష్టపోయిన తమకు పరిహారాన్ని కలిపి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**తరచూ నష్టపోతున్నా..**

అకాల వర్షాలు, తుపాన్ల ప్రభావంతో ప్రతి సీజన్‌లోనూ రైతులు పంటలు నష్టపోతున్నా ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడం లేదు. భారీగా నష్టపోయిన సందర్భాల్లోనూ కంటితుడుపుగా పరిహారమిస్తున్నారే తప్ప, నష్టపోయిన ప్రతీ సందర్భంలో చెల్లించకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. జిల్లాలో 2023 మార్చిలో కురిసిన అకాలవర్షాలతో 371 ఎకరాల్లో పంటనష్టపోగా, ఆ రైతులకు రూ.37.16లక్షల పరిహారమిచ్చారు. ఆతర్వాత తిరిగి 2024 ఏప్రిల్‌లో 32 ఎకరాల్లో, సెప్టెంబరులో 413 ఎకరాల్లో పంటనష్టపోగా, ఈ రెండు సందర్భాల్లో కలిపి సుమారు రూ.44.55లక్షల పరిహారాన్ని వ్యవసాయశాఖ నివేదించినా నిధులు రాలేదు. 2025 ఏప్రిల్‌లో యాసంగి సీజన్‌లో పంటనష్టం జరగ్గా, పరిహారమివ్వలేదు. రాష్ట్రంలో పంటలబీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాలు సక్రమంగా అమలుకాకపోవడం వల్లే పంటలు నష్టపోయినా రైతులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

# సమస్యలతో సహవాసం

- సమస్యలకు నిలయంగా 'దేవరకొండ'
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు
- వానొస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం
- రూ.57 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు



దేవరకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు గుంతలమయమై, జలమయమై అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీ కాల్వలు మురుగునీటితో పేరుకుపోయి ధ్వంసమయ్యాయి. వర్షం వస్తే లోతట్టు కాలనీల ప్రజలు ఇళ్లలోకి నీరు చేరుతుండటంతో ఆందోళన చెందే పరిస్థితి. సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తుండటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పార్కుల నిర్వహణ లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

దేవరకొండ మునిసిపాలిటీలో 20వార్డులకు గాను 42 కు పైగా కాలనీలు ఉన్నాయి. 8500 గృహాలు ఉండగా 50వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. దేవరకొండ మునిసిపాలిటీలో రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరై రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినా పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో రూ.27 కోట్లు ప్రతిపాదనలు పంపించామని, రూ.57 కోట్లతో దేవరకొండ పట్టణంలోని అన్ని కాలనీలకు రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

**వర్షాలకు జలమయమవుతున్న కాలనీలు**

దేవరకొండ పట్టణంలోని 3వ వార్డు, సంజయ్‌కాలనీ, హనుమాన్‌నగర్, 10వ వార్డు లోతట్టు కాలనీల ప్రజలు వర్షాలు వస్తే భయపడే పరిస్థితి. వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలను పూడిక తీయకపోవడం, నిర్మాణాలు జరపకపోవడంతో వర్షపునీరు కాల్వలు నిండి ఇళ్లలోకి ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలని లోతట్టు కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 3వ వార్డు సంజయ్‌కాలనీ శివారులోకి భారీగా వర్షపునీరు చేరింది. సత్తయ్య అనే వృద్ధుడు నీటి ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోగా స్థానికులు, మునిసిపల్ అధికారులు కాపాడారు.


**కంకరపరిచారు, పనులు నిలిపివేశారు**

దేవరకొండ పట్టణంలోని మీనాక్షి సెంటర్ నుంచి మైనంపల్లి వరకు 4.4 కిలోమీటర్లు రూ.14 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులను గతేడాది రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 30శాతం పనులు జరిగాయి. కాంట్రాక్టర్ రోడ్లపై కంకరపేర్చి ఇటీవల కురిసిన వర్షాలకు పనులు నిలిపివేశాడు. దీంతో రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనులను తిరిగి ప్రారంభించి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

**పార్కుల నిర్వహణ ఏదీ**

దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో ఖిల్లాలో రూ.5 కోట్లు, సంజయ్‌కాలనీ, హనుమాన్‌నగర్, ముత్యాలమ్మ వీధులలో రూ.50 లక్షలతో మినీ పార్కులు నిర్మించారు. కానీ నిర్వహణ లేకపోవడంతో మినీ పార్కుల లోని ఆట వస్తువులు ధ్వంసమవుతున్నాయి. ఖిల్లాలో రూ.5 కోట్లతో పార్కును ఐదు ఎకరాల్లో ఆహ్లాదకరంగా ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక పర్యాటకులకు సౌకర్యాలు లేకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి పర్యాటకులకు తాగునీరు, సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యాటకులకు రక్షణ కల్పించాలి.

**రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలి**



దేవరకొండ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు,డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

- ఇరగదిండ్ల కృష్ణ, గాంధీనగర్, దేవరకొండ

**రూ.57 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు**



దేవరకొండ పట్టణంలోని అన్ని కాలనీలకు రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే 19 కిలోమీటర్ల మేర రోడ్డు పనులను ప్రారంభించాం. మరికొన్ని పనులకు త్వరలో ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపనలు చేసి ప్రారంభిచనున్నారు. రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేసి సమస్యలను పరిష్కరిస్తాం.

- సుదర్శన్, మునిసిపల్ కమిషనర్, దేవరకొండ



**రోడ్లపైనే కూరగాయల విక్రయాలు**

దేవరకొండలో సమీకృత మార్కెట్ లేకపోవడంతో కూరగాయలు, మాంసం వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు జరుపుతున్నారు. దీంతో పట్టణంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సమీకృత మార్కెట్‌కు గతంలో నిధులు మంజూరైనా అధికారులు స్థల సేకరణలో జాప్యం చేశారు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యం

నిడమనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని ముప్పారంలో సోమవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యా నికి మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేసి చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర అందుతుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో మునికృష్ణయ్య, ఏపీఎం నరహరి, సీసీ నర్సింహాచారి, ఏఈవో క్రాంతి, కోట్ల సైదులు, ఆలంపల్లి కృష్ణ, వెంకటరమణ, దారం యాదగిరి, కంచి రవి, మల్లిక పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి**

**చింతపల్లి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాల్ మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369లు మద్దతు ధర లభిస్తుందని, సన్నధాన్యానికి రూ.500లు బోనస్ కూడా అందిస్తున్నామన్నారు. 17శాతం తేమతో ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే భూమికి సంబంధించిన పత్రాలను నిర్వాహకులకు రైతులు అందజేస్తే ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏవో శ్రవణకుమారి, ఏఈవోలు మౌనిక, ప్రియాంక పాల్గొన్నారు.



చింతపల్లి పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అలివేలు

## మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




రాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పెద్దవూర, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మండల విద్యాధికారి తరి రాములు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో 2025-26 విద్యాసంవత్సరానికి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన వారిని వారిని మోమెంటోలు, శాలువాలు, ప్రశంస పత్రాలు ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఉపాధ్యాయులు దోహదపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో తరి రాములు, ఎంపీడీవో ఉమాదేవి, వివిధ ప్రభుత్వ పాఠశాలలు చెందిన పలువురు ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టాస్మో జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

నిడమనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ ఇండియా(టాస్మో) జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయనకు టాస్మో జాతీయ అధ్యక్షుడు కంతే సత్యశంకర్ నియామకపత్రాన్ని అందించారు. శ్రీనివాస్ రెండు దశాబ్దాలుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10వేల మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి ఇటీవలే గిన్నీస్ బుక్ రికార్డులో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. టాస్మోలో సభ్యత్వం కావాల్సిన కరాటే మాస్టర్లు తనను సంప్రదించాలని కోరారు.

## ఆర్థిక సాయం అందజేత

మిర్యాలగూడటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న వీరబాబుకు నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.31వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయిబ్రాహ్మణ సేవాసంఘ రాష్ట్ర కార్యదర్శి ఆలగడప గిరిధర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వీరబాబు వేరీకోస్ వ్యాధి బారినపడటం దురదృష్టకరమన్నారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. సంఘంలోని పేదలకు అండగా ఉంటామని, అవసరానికి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు నాగవెల్లి ఉపేందర్, యాదగిరి, రవి, నరసింహ, సైదులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తుల సేవలు మరువలేనివి



జిల్లా అదనపు జడ్జి వేణును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడలీగల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న న్యా యమూర్తుల సేవలు మరువలేనివని బార్ అసోసియేషన్ కొనియాడింది. 5వ అదనపు జిల్లా జడ్జి వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ బదిలీ కాగా బార్ అసోసియేషన్ సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో సంఘం అధ్యక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారంలో ఇరువురు చూపించిన చొరవ గొప్పదన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తూనే బాధితులకు న్యాయం అందించేందుకు తమదైన రీతిలో పనిచేసినట్లు కొనియాడారు. అనంతరం సంఘం సభ్యులు ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జడ్జి, నల్లగొండ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలాజైన్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌తేజ్, బార్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, అదనపు పీపీ రఘురామారావు, ఏజీపీలు గోదాల వెంకటరెడ్డి, మట్టపల్లి శ్రీధర్‌గౌడ్, న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, మంద సైదులు, నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వై. శ్రీనివాస్ స్వరాజ్యం, కామేశ్వరరెడ్డి, జి. శ్రీనివాస్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

## యాంత్రీకరణకు ఆమోదం

(5వ పేజీ తరువాయి)

ఆరేళ్ల తరువాత యాంత్రీకరణ పథకం అమలవుతున్న నేపథ్యంలో పండుగలాగా కార్యక్రమాన్ని నిర్వహించి యంత్రాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేవిధంగా పనిముట్లకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు త్వరలో ఉమ్మడి జిల్లా స్థాయిలో అవగాహన సదస్సులతో పాటు ప్రదర్శనలు నిర్వహించే అవకాశం ఉంది. పనిముట్లు, యంత్రాలు తయారుచేసే సంస్థల సహకారంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ అనుబంధ రంగాలను భాగస్వాములను చేయనున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేందుకు ఈ సదస్సులను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందాలంటే కూలీల కొరత ఉన్న ప్రస్తుత సమయంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. అధికారులు ఏర్పాటు చేసే ప్రదర్శనలో అత్యధికంగా రైతులకు ప్రయోజనం కలిగే పనిముట్లను ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన రెండు రోజులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ ప్రదర్శనలో పురుగు మందులను డ్రోన్ల ద్వారా పిచికారీ చేసేలా రైతులకు అవగాహన కల్పించనున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలను రైతులకు అందజేస్తాం. ఇప్పటికే మండలస్థాయి కమిటీల నుంచి నివేదికలు రావడంతో ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు వాటిని పంపాం. ఈ నెల 14వ తేదీ లోగా జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. యాంత్రీకరణ పథకం నిరంతరంగా కొనసాగనుంది. ప్రతీ రైతుకు ఈ పథకాన్ని వర్తింపజేయడం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయం చేయడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

## నాణ్యత పేరుతో కొనుగోలు నిరాకరణ



చింతపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

చింతపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నాణ్యత పేరుతో కొనుగోళ్లు నిరాకరించడం సరికాదని పలువురు రైతులు అన్నారు. చింతపల్లి మండలకేంద్రంలోని వెంకటేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐ అధికారులు నాణ్యతా ప్రమాణాల పేరుతో పత్తి కొనుగోలును నిలిపివేయడం సరికాదని అన్నారు. రైతులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు కోసం రైతులకు మద్దతు ధర అందించాలని, సీసీఐ వారు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.